# అంతేమరి!

సాయంకాలాల్ని చీకటి మింగేస్తోంది. రామారావు వీధి అరుగు మీద కూర్చుని, రోడ్డు మీద వచ్చే పోయే జనాన్ని చూస్తున్నాడు.

వ్యవసాయ కూలీలు పాటలు పాడుకుంటూ పొలాల్నుంచి ఇళ్లకు పోతున్నారు. వాళ్లల్లో హరిజనులూ వున్నారు. వాళ్లను చూసేటప్పటికి రామారావుకు వొంటి మీద తేళ్లూ, జెర్రులూ పాకినట్టు అయింది. కాలుస్తున్న చుట్టను కసుక్కున కొరికి, కాండ్రించి వుమ్మేశాడు రామారావు. కూటికి గతిలేక పోయినా, పొద్దంతా పొలంలో కష్టపడినా వాళ్లకు ఆ నవ్వులూ కేరింతలూ యెలా వస్తాయి? అన్న ఆలోచన వచ్చింది అతనికి.

ఇంతలో తన పొలం గుర్తొచ్చింది. తన చేలో హరిజనులు ఇళ్ళ స్థలాల కోసం రాళ్ళు పాతడం గుర్తొచ్చింది.

"ఆ రాళ్ళను యెవర్నడిగి వేశారు? వాళ్ళంతా యేకమై నా పొలాన్ని ఆక్రమించేసుకున్నారు. సేద్యానికి వుపయోగపడని పొలమే కావచ్చు, అయితే మాత్రం మొన్నటి వరకూ నా ముందు తలెత్తుకు తిరగడానికి జంకే యెదవలు, ఇప్పుడు

నా తలే వంచేశారు, వీళ్ళకు తగిన శాస్తి చెయ్యాలి, లేకపోతే నా పొలం, మా తాతలు కట్టించి యిచ్చినమేడ, నేను సంపాదించిన ఆస్తి - అంతా ఆక్రమించేసుకోగలరు," రామారావు దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు.

కందిపోయిన ముఖంతో రామారావు కొడుకు కిశోర్ పొలం నుంచి యింటికి వచ్చాడు.

"ఏమిట్రా సంగతి, అలా వున్నావు"

"అణాకానీకి పని చెయ్యని వెధవలు, యెంతంత మాటలన్నారు. ఎంత వెటకారం నేర్చారు. అమ్మమ్మ. కూటికి టికానా లేదుగానీ. వుంటే యింకెంత గర్వం బలిసి పోనూ! నేను మాత్రం యేవన్నాను? మా స్థలోలం పాకలు వేసుకుంటున్నారన్న మాట అని అన్నానంతే, "యింకా మీదేటి. యిప్పుడిదంతా మాది, మాది" అంది పగలబడి నవ్వుతూ సుబ్బులు. శేషగిరిలేడూ, హీరో. హరిజన నాయకుడు. వాడి చెల్లెలే ఈ పొగరుబోతు సుబ్బులు, అది అలాగనడంతో మిగతా వాళ్ళంతా కిసుక్కున నవ్వారు. నా తల తీసేసి నట్టయింది. ఆఖరికి మాలి నాకొడుకులకూడా చులకనై పోయాం ఛీ ఛీ"

"ఛీ ఛీ అని వాళ్ళనంటే వారిగేదేముంది? మనల్ని అనుకుంటే వారిగేదేముంది? "

"వారిగేదేం లేదు కనకే అలాగంటున్నా. పోనీ నువ్వేదేమైనా మారం చెప్పు, యేం అనాలో" అని తండ్రికేసి విసురుగా చూశాడు కిశోర్.

రామారావు అగ్గిపుల్లతో చుట్ట వెలిగించి. ఆలోచనలో పడ్డాడు. కిశోర్ కళ్ళముందు సుబ్బులు కదిలింది.

"సుబ్బులూ, నాకొళ్ళు మండేలా నువ్వు నవ్వినా ఎందుకూరు కున్నాననుకున్నావ్? నీ జబ్బలనునుపు చూసి, కొండ చిలువలాంటి నీ ఒంటి బిగువు చూసి, లేకపోతే నీ గూబ గుయ్యిమనిపించేద్దును. నీ వెటకారం నవ్వులో కూడా యెంత అందం వుంది. అందమైన వాళ్ళు యేం చేసినా అందంగా వుంటుందనుకుంటా" ఆలోచనలకు పెళ్ళాం పులుస్టాపు పెట్ట డంతో కిశోర్ యింటి లోపలికి వెళ్ళాడు.

* * *

గోదావరి గాలి చల్లగా వీస్తోంది. మామిడి చెట్లు పచ్చగా తలలూపు తున్నాయి. కొబ్బరి చెట్లు పిల్లల్ని చూసుకొని మురిసిపోయే తల్లుల్లా వున్నాయి, మెడనిండా వేలాడుతున్న కొబ్బరికాయలతో.

మొన్నటివరకూ ఖాళీగావున్న స్థలంలో చిన్న చిన్న పాకలు లేస్తు న్నాయి. అక్కడ అందరూ తలోపనీ చేసుకుంటున్నారు. కొందరు స్తంభా లను పాతుతున్నారు. కొందరు కొబ్బరి తాళ్లతో దూలాలమీద గెడలు కడుతున్నారు.

సుబ్బులు హుషారుగా నేలంతా చదునుచేస్తోంది, పీళ్ళు చిమ్ముతోంది ఎంత పని చేస్తున్నా ఆమె మొహంలో అలసట కనిపించడం లేదు.

"ఇంక మావగోరి పాకలోనే వుండక్కర్లేదు, తనూ, తాతిగాడూ యీ కొత్త యింటిలో దరిజాగా వుండొచ్చు, సుకంగా గడపొచ్చు. ఇన్నాల్లూ ఆ కాసేపు సుకంలోనూ బయమే, మొగుడితోనే తొంగున్నా యేదో తప్పు చేసినట్టు బయం. అడ్డంగా కట్టిన గోనిసంచీ గాలికి యెగిరి వూడిపోతాదేమో, అత్త యింకా తొంగోకుండా సుక్కల్ని లెక్కెడతా కూకుందేమో, నులకమంచం సప్పుడు యినపడతాదేమో.., ఓరిదేవుడా,

యిన్నాళ్లూ బయం బతుకే యిచ్చేవుగదరా, ఇక్కడినుంచైనా దయిర్నంగా హాక్కుగా, హాయిగా .. సుబ్బులు మధురోహాలతో పని చేస్తోంది.

సోమన్న కొబ్బరి తడకలు అల్లుతున్నాడు. తన బతుకంతా చిక్కులుగా అల్లుకుపోడమేగానీ విడడం అనేదిలేదు యిన్నాళ్లూ. ఇప్పటికైనా తలదాచుకోడానికో గుడిసె దొరికింది శేషగిరీ, మిగతా కుర్రాళ్లూ ధైర్యం చెయ్యబట్టిగానీ, లేపోతే పూర్వంలాగే అంతా మామూలే. మొదట వాళ్ల ధైర్యం చూపి తనకెంత భయం వేసిందనీ! అదే చెబితే వాళ్లెంతా కోపడ్డారనీ... అప్పుడు తనకూ కోపం వచ్చేసింది, పెద్దోడిమాట కుర్రోళ్లు వినడంలేదని, తనమాట వినకపోడమే రైటని ఇప్పుడు తెలిసింది. ఈ స్థలాన్ని ఆక్రమించుకున్న రోజున కుర్రాళ్లు యెంత వుత్సాహంగా వున్నారు. అప్పుడు రామారావుగారు మాత్రం వూరుకున్నారా? పోలీసోళ్లను పిల్పించారు పోలీసోళ్లు లాఠీల్నీ, తుపాకుల్నీ పట్టుకువచ్చారు. అయినా, శేషగిరీ మిగతా కుర్రాళ్ళూ బెదిరి పోలేదు. వాళ్ళముందే, ఆ పోలీసోళ్ళముందే ఎర్రజెండా పాతేశారు. ఎంత తెగువో! ఎర్రెర్రని జెండా గిరగిరగా యెగురుతుంటే ముసలోణ్ని నాకే ధైర్యమొచ్చేసింది. కుర్రోళ్ళతోపాటు ముసలోల్లం మేమూ రాళ్ళు పాతేశాం. లాఠీ దెబ్బల్ని దోంట్ కేరనేశాం. తర్వాత, శేషగిరీ, కుర్రాళ్లూ తమ పార్టీ నాయకుడితో మాట్లాడి వచ్చారు. ఆ తర్వాత పోలీసోళ్లురాలేదు. రామారావుకూడా కిక్కురు మనడంలేదు ఈ మధ్య. సోమన్న ఆలోచిస్తూనే నాలుగు కొబ్బరి చాపలు అల్లేశాడు, మరో చాప అల్లడానికి కొబ్బరాకును మధ్యకు చీల్చాడు.

* * *

"ఏయ్ సరసాలు తర్వాత, ముందు పనికానివ్వండి" అన్నాడు కిశోర్ పొలంగట్టుమీద కూచుని,

సుబ్బులూ, తాతిగాడూ ఒకరి మొహం ఒకరు చూసుకొని, తర్వాత కొడవళ్ళకు పనిచెప్పారు. పొలంలో తలెత్తి చూస్తున్న వరిఎన్నెలు, భూమ్మీద పనలుగా పడుతున్న వరి ఎన్నెలు బంగారంలా మెరిసిపోతున్నాయి

"సిరసుమీదా సూరీడెక్కి అగ్గినిప్పులు సెరుగుతుంటే, కడుపులోనా అకలేసిందా ఓ కూలి రైతా; కండసీమా కాటు కరిసిందా" అంటూ తాతిగాడు గొంతెత్తి పాడుతున్నాడు. పనిచేస్తూనే మిగతా కూలీలు వంత పాడుతున్నారు.

కిశోర్ పాట వింటున్నాడు, కానీ పట్టించుకోడంలేదు పని చురుకుగా సాగుతున్నందుకు సంతోషించాడు, మధ్యలో సుబ్బుల్ని దొంగ చూపులతో దోచేసుకుంటున్నాడు.

చీకటి పడింది. కోత ముగిసింది. నడుం వంచిన కూలీలంతా నిలబడ్డారు. పక్కనేవున్న చెరువులో కాళ్ళూ, చేతులూ కడుక్కొని వచ్చారు కిశోర్ అందరికీ కూలిడబ్బులు ఇస్తున్నాడు. డబ్బులు తీసుకున్న వాళ్లందరూ యిళ్లకు నడుస్తున్నారు. తాతిగాడు వచ్చాడు, కిశోర్ ముందుకు. యాభై రూపాయల కాగితం పట్టుకుని నిలుచున్నాడు కిశోర్.

"ఒరే, నీ దగ్గరి కొచ్చేటప్పటికి చిల్లర నోట్లు అయిపోయాయి. ఊళ్ళోకిపోయి. నేనిమ్మన్నానని కిరాణాకొట్టు దగ్గర విడినోట్లు పట్టుకురా, వేగరా" అన్నాడు కిశోర్.

ఏభై రూపాయల కాగితం పట్టుకుని నీరసంగా నడుస్తుంటే తాతిగాడి పక్కనే సుబ్బులూ నడవబోయింది.

"ఒసే, సుబ్బులూ. నీ కూలి డబ్బులు కూడా నీ మొగుడికే ఇచ్చేమంటావా? లేకపోతే నీకే ఇమ్మంటావా" అన్నాడు నవ్వుతూ కిశోర్.

"ఎవరికి యిత్తే యేటండి"

"పర్లే, తాతిగాడికే యిచ్చేస్తానుగానీ. దూళ్ళపాకలో కాస్త శుభ్రం చేసిపో. ఒరే తాతిగా వేగా వచ్చేయ్" అని చెరువు గట్టుకేసి నడిచాడు కిశోర్, సుబ్బుల్నీ, తాతిగాడ్నీ చూడనట్టే నటిస్తూ.

తాతిగాడు ఊళ్ళోకి నడిచాడు, సుబ్బులు దూళ్లపాకలోకి నడిచింది. చెరువు గట్టువైపు నడిచిన కిశోర్ కొన్ని నిమిషాల తర్వాత, దూళ్ళపాకలోకే నడిచాడు.

సుబ్బులు పశువుల దగ్గరున్న పేడను పోగుచేస్తోంది. కిశోర్ ఆమెను బలంగా వాటేసుకున్నాడు. సుబ్బులు యెదురు చూడని సంఘటనకు స్తంభించి పోయింది. వెంటనే అతన్ని అసహ్యంగా చూసి, గెంటయ్య బోయింది. అతను వదలలేదు. అరవ పోయింది. నోరు మూసేశాడు సుబ్బులు గించు కుంది. కిశోర్ అదిమి పట్టుకున్నాడు. పాలికాపును గట్టిగా కేకేశాడు రమ్మని. చెరువుగట్టు దగ్గర నుంచి పాలికాపు పరుగెట్టుకుని వచ్చాడు

సుబ్బులు ఏడుపుకూ, అసహాయతకూ, బాధకీ, భయానికీ, అసహ్యానికీ చీకటి నవ్వింది. చీమూ, నెత్తురూ లేని వికృతపు జంతువులా పిచ్చిగా నవ్వింది.

తర్వాత, కిశోర్ పాలికాపుతో చెప్పాడు. వాడు జంకేడు, కిశోర్ కళ్ళెర్ర జేశాడు. వాడు నసుగుతూ వెళ్ళిపోయాడు. గుడిసెల దగ్గరకు, కిశోర్ తీరినకసితో అడ్డదారంట పరుగులాంటి నడకతో యిల్లు చేరుకున్నాడు.

కిరాణాకొట్టు దగ్గరా, సారాకొట్టు దగ్గరా, వూరంతా తిరిగి తిరిగి చిల్లర దొరక్క, ఓరాగ్గా నీరసంగా వెనక్కు తిరిగాడు తాతిగాడు.

రాత్రి యెనిమిది గంటలకే, పొద్దస్తమానం పని చేయడం వల్ల అలసిపోయి నిద్రలోకి జారుకున్న జనం హఠాత్తుగా, అయోమయంగా, భయం భయంగా లేచారు. పాకల్లోంచి బయటకు పరుగెత్తారు. ముసలోళ్లను యీడ్చుకుంటూ పరుగెత్తారు. బిందెలూ, చెంబులూ, కుండలూ-నీరు తేవడానికి యేది దొరికితే అది పట్టుకుని పరుగెత్తారు,

ఎవర్నీ యేమాత్రం పట్టించుకోకుండా మంటలు, గుడిసెల్ని తగలెడుతూ, జనం చిరు ఆశల్నీ, సుఖాల్నీ తగలెడుతూ నిర్దయగా, నిర్భయంగా మంటలు, తల్లులూ, పిల్లలూ, తండ్రులూ, తాతలూ అంతా గుడిసెలు మీది మంటల్ని చూస్తూ నిస్తేజంగా గుండె మంటలతో,

తాతిగాడి భుజం మీద తల ఆన్చి అక్కడకు వచ్చింది సుబ్బులు, మంటల్ని ఆర్పడానికి ప్రయత్నం చేస్తున్న జనంలోంచి వాళ్ళిద్దర్నీ ఆశ్చర్యంగా చూశాడు శేషగిరి, చెల్లెల్ని తేరిపార చూశాడు. తాతిగాడు పెదాలు కదపలేక పోతున్నాడు. అన్నీ చెప్పాలనీ చెప్పలేక పోతున్నాడు. సుబ్బుల్ని చూస్తున్నాడు పొదవి పట్టుకుని, అక్కున చేర్చుకుని.

సుబ్బులు కంఠం విప్పింది. కిశోర్ గురించి, వాడి కిరాతకం గురించి వాడు తన పాలికాపును యేదో చెప్పడం గురించి ఆగకుండా మాట్లాడుతోంది, లేని సత్తువ తెచ్చుకుని, అందరికీ అర్థమయ్యేలా మాట్లాడుతోంది.

సుబ్బులి కళ్లల్లో నిప్పులు, తాతిగాడి కళ్లల్లో నిప్పులు, శేషగిరి కళ్లల్లో నిప్పులు, చిన్నా, పెద్దా రామారావు యింటివైపు పరుగు, కర్రల్తో, కొడవళ్లతో, ఒకటే పరుగు, ఒకటే ఆలోచన,

(యువజన మాసపత్రిక మే '78)